కౌన్సిలర్ ప్రమోద్‌కుమార్‌కు ప్రముఖుల పరామర్శ

రోజా మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

భువనగిరి అర్బన్, జనవరి 19 : భువనగిరి మున్సిపాలిటీలో 10వ వార్డు కౌన్సిలర్ పొత్నాక్ ప్రమోద్‌కుమార్ భార్య రోజా శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. ఆదివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డితో పాటు ప్రముఖులు, ఆయా పార్టీల జిల్లా నాయకులు రోజా మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రమోద్‌కుమార్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, పలువురు నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

వస్తాకొండూర్‌లో బంధగిరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

గుండాల, జనవరి 19 : మండలంలోని పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. సీతారాంపురం గ్రామంలో లైన్‌మెన్ వనమోజు శ్రీధర్ కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి కుటుంబాన్ని, వస్తాకొండూర్‌లో అనారోగ్యంతో మృతిచెందిన గనగాని బంధగిరి కుటుంబ సభ్యులను, అదే గ్రామానికి చెందిన గుండె ఆపరేషన్ చేయించుకున్న అప్పారెడ్డిని సునీత పరామర్శించారు. ఆమె వెంట మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పిట్టల పూర్ణచందర్, కోలుకొండ రాములు, పాలబిందెల రాములు, కాశయ్య, వెంకన్న, రాజు, రంజిత్‌రెడ్డి, మల్లారెడ్డి, సోమన్న, భిక్షం, సాయికుమార్ ఉన్నారు.

ఎయిమ్స్‌లో సరిపడా వైద్య సిబ్బందిని నియమించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

బీబీనగర్, జనవరి 19 : మండలంలోని ఎయిమ్స్ దవాఖానలో సరిపడా వైద్య సిబ్బందిని నియమించి అన్ని రకాల వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏకైక కేంద్ర సంస్థగా బీబీనగర్‌లో ఉన్న ఎయిమ్స్ హాస్పిటల్ పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. నిర్మాణం పూర్తయిన భవనాల్లో వైద్య సేవలు ప్రారంభించినప్పటికీ పూర్తిస్థాయి వైద్యం అందకపోవడం వల్ల ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారని తెలిపారు. అన్ని రకాల స్పెషలైజేషన్ డాక్టర్లు, సిబ్బందిని తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకంలో డబ్బులు తీసుకుంటున్న కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీర్ఘకాలిక రోగాలకు, యాక్సిడెంట్ వంటి ఎమర్జెన్సీ సేవలను, డాక్టర్లు లేరనే నెపంతో ప్రసూతి సేవలు కూడా అందించట్లేదని అన్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ప్రజలకు అన్ని రకాల మెరుగైన వైద్యం అందించాలని కోరారు. సీపీఎం జిల్లా నాయకుడు చంద్రారెడ్డి, మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు దేవేందర్ రెడ్డి, భిక్షపతి, ఉమర్, సతీశ్, యాదమ్మ, రామచంద్రారెడ్డి, శ్రవణ్, శివకుమార్, కిరణ్‌కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5న దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

భువనగిరి అర్బన్, జనవరి 19 : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 5న దేశవాప్తంగా నిర్వహించే ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కార్మికులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి కార్పొరేట్ అనుకూల, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. కార్మికులు సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి ఏప్రిల్ 1నుంచి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొస్తుందని తెలిపారు. వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి ఏటా బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ పథకాన్ని పక్కకు పెట్టే కుట్ర చేస్తుందని విమర్శించారు. జిల్లాలో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం, ఉపాధ్యక్షుడు గొరిగె సోములు, సహాయ కార్యదర్శులు తుర్కపల్లి సురేందర్, బోడ భాగ్య పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

ఆత్మకూరు(ఎం), జనవరి 19 : మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ లబ్ధిదారులు ఈ నెల 6న అదనపు కలెక్టర్ గంగాధర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆదేశాలు జారీ చేసి 13రోజులు గడుస్తున్నా నేటికీ డబుల్ బెడ్రూం ఇండ్ల వద్దకు జిల్లా, మండల స్థాయి అధికారులెవరూ రాలేదు. ఉన్నతాధికారి ఆదేశించినా కిందిస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

విజయవాడ హైవేపై వాహనాల రద్దీ


చౌటుప్పల్‌లో బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్, జనవరి 19 : సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు పట్నం బాట పట్టారు. దాంతో ఆదివారం 65వ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. ఈ క్రమంలో చౌటుప్పల్‌లో వాహనాలు బారులుదీరాయి. దీనిని అధిగమించేందుకు హైవేపై వాహనాలు నిలుపకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తంగడపల్లి క్రాసింగ్‌ను మూసివేశారు. దాంతో సంస్థాన్ నారాయణపురం వైపు వెళ్లే వాహనదారులు వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద యూటర్న్ తీసుకొని వెళ్లారు. ఆదివారం పట్టణంలో సంత కావడంతో సర్వీస్ రోడ్లు కూడా కిక్కిరిసిపోయాయి. పట్టణంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ నెలకొంది. మొత్తం 16 టోల్ బూత్‌లకు గాను హైదరాబాద్ వైపు 12 తెరిచారు.

మోటకొండూర్ ఎస్‌ఐగా ఉపేందర్ బాధ్యతలు



మోటకొండూర్, జనవరి 19 : భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి మోటకొండూరు మండలానికి ఎస్‌ఐగా బదిలీపై వచ్చిన నాగుల ఉపేందర్‌యాదవ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు శాంతి భద్రతలకు సహకరించాలన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక : కలెక్టర్

పోచంపల్లి : సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భూదాన్ పోచంపల్లి/ చౌటుప్పల్/ సంస్థాన్ నారాయణపురం, జనవరి 19 : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిర ఇండ్ల జారీకి లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపడుతున్నామని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పోచంపల్లి మండలంలోని దేశ్‌ముఖి, చౌటుప్పల్ మండలం డి.నాగారం, సంస్థాన్ నారాయణపురం మండలంలోని కోతులాపురం గ్రామాల్లో సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న తీరును ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే బృందాలు సేకరిస్తున్న వివరాలను, రైతులకు సంబంధించిన పట్టా భూములను, అసైన్డ్ స్థలాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు భరోసా పథకానికి సాగుకు యోగ్యంకాని భూములను జాగ్రత్తగా గుర్తించాలని అధికారులకు సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. కార్యక్రమాల్లో ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, డీఏఓ గోపాల్, డీఎస్‌ఓ వనజాత, ప్రత్యేకాధికారి జయశ్రీ, తాసీల్దార్లు ఎస్.హరికృష్ణ, కృష్ణ ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓలు రాపర్తి భాస్కర్‌గౌడ్, సందీప్‌కుమార్, ప్రమోద్‌కుమార్, ఏఓలు శైలజ, నాగరాజు, సివిల్ సప్లయ్ అధికారి బాలమణి, ఎంపీఓలు మజీద్, నరసింహారావు, ఏపీఓ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 19 : అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తామని, దరఖాస్తు చేసుకోనివారు గ్రామ సభల్లో అందించవచ్చని కలెక్టర్ హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి పథకాలు అందుతాయని, రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. గ్రామ, వార్డు సభల్లో, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్న వాటిని పరిశీలించి అర్హులకు రేషన్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. కొత్త రేషన్ కార్డుల జాబితాలో పేర్లు లేనివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ఇదివరకు ఎప్పుడూ దరఖాస్తు సమర్పించకపోయినా ఈ నెల 21నుంచి 24వరకు నిర్వహించే గ్రామ సభల్లో దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవాళ్లకు పథకాలు వర్తిస్తాయని వివరించారు.

21నుంచి 24 వరకు వార్డు సభలు : మున్సిపల్ కమిషనర్

భువనగిరి అర్బన్, జనవరి 19 : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పట్టణంలోని వార్డుల్లో ఈ నెల 21నుంచి 24 వరకు వార్డు సభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభల్లో పట్టణ ప్రజలంతా పాల్గొని రేషన్ కార్డుల వివరాలు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాను చూసుకోవాలని పేర్కొన్నారు. జాబితాలో పేరు లేనివారు ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరూ వార్డు సభల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 1, 2వ వార్డులకు సంబంధించిన వార్డు సభ ఈ నెల 21న అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు 5వ వార్డు సభ భారత్ యూత్ గణేశ్ మండపం వద్ద, 7వ వార్డు సభ హనుమాన్‌వాడలోని హనుమాన్ దేవాలయం, 8వ వార్డు సభ జంఖాన్‌గూడలోని వినాయక మండపం, 31వ వార్డు సభ బంజారాహిల్స్‌లోని గణేశ్ మండపం, 26వ వార్డు సభ బహార్‌పేట్‌లోని అంబేద్కర్ భవనం సమీపంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 22న రాయగిరిలోని ఎస్సీ కాలనీలో గల శివాలయం సమీపంలో 3వ వార్డు సభ, బొమ్మాయిపల్లిలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో 11 వార్డు, హుస్సేనాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 14వ వార్డు, ఆర్‌బీనగర్‌లోని నెహ్రూ కెనడీ పార్కు వద్ద 18వ వార్డు, రెడ్డి వాడలోని బస్తీ దవాఖాన సమీపంలో 21వ వార్డు, ఇందిరా నగర్‌లోని అరుంధతి కమ్యూనిటీ హాల్‌లో 23వ వార్డు, హైదరాబాద్ చౌరాస్తాలోని భగాయత్ పాఠశాల ఆవరణలో గల రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో 25వ వార్డు, జలీల్‌పరలోని పాత లైబ్రరీలో 27వ వార్డు, ప్రగతినగర్‌లోని వాటర్ ట్యాంకు వద్ద 13వ వార్డు సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ నెల 23న 4వ వార్డు సభ రాయగిరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో, 10వ వార్డు సభ హౌజింగ్ బోర్డులోని కమ్యూనిటీ హాల్లో, 15వ వార్డుకు సంబంధించి అర్బన్ కాలనీలోని వాటర్ ట్యాంకు వద్ద, 16వ వార్డు సభ అర్బన్ కాలనీలోని కాకినాడ బస్తీ ప్రాథమిక పాఠశాలలో, 19వ వార్డు సభ కుమ్మరివాడలోని గణేశ్ మండపం వద్ద, 22వ వార్డు సభ ఇందిరానగర్‌లోని కమ్యూనిటీ హాల్లో, 28వ వార్డుకు సంబంధించి మీనానగర్‌లోని వినుత్నా దవాఖాన వెనుక భాగంలో, 29వ వార్డు సభ ఏఎంఆర్ నగర్‌లోని బ్రిలియంట్ స్కూల్లో, 32వ వార్డు సభ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తారని తెలిపారు. 24వ తేదీన 6వ వార్డు సభ హనుమాన్‌వాడలోని పోచమ్మ దేవాలయం సమీపంలో, 12వ వార్డుకు సంబంధించి తాతానగర్‌లోని వెటర్నరీ దవాఖానలో, 17వ వార్డు సభ శ్రీరామ్‌నగర్‌లో, 20వ వార్డు సభ గాంధీనగర్ పోచమ్మ దేవాలయం సమీపంలో, 24వ వార్డు సభ దోబీవాడలోని శివాలయం సమీపంలో, 30వ వార్డు సభ నవభారత్ డిగ్రీ కళాశాలలో, 33వ వార్డు సభ విద్యానగర్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో, 34వ వార్డు సభ చత్రపతి శివాజీ పార్కు వద్ద, 35వ వార్డు సభ ఆర్‌బీనగర్‌లోని గణేశ్ మండపం, బీవీఆర్ కిరాణ షాపు వద్ద నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభల్లో ఆయా వార్డుల ప్రజలు పాల్గొని దరఖాస్తులను అందజేయాలని సూచించారు. వార్డు సభలు నిర్వహించే స్థలంలో ప్రత్యేకంగా టెంట్లు, కుర్చీలు, మైకసెట్, ఫ్లెక్సీ, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన జాబితాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రదర్శించాలని సూచించారు. దరఖాస్తులు సమర్పించిన వారికి రసీదు ఇవ్వాలని పేర్కొన్నారు. వార్డు సభలు ఉదయం 9గంటలకు ప్రారంభమవుతాయని, కేటాయించిన అధికారులు సకాలంలో చేరుకోవాలని సూచించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మున్సిపాలిటీలో 21నుంచి వార్డు సభలు

భూదాన్ పోచంపల్లి, జనవరి 19 : సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 21నుంచి 24 వరకు వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న ఉదయం 9 గంటలకు మహమ్మాయి కాలనీ, పద్మానగర్‌కాలనీ (కమ్యూనిటీ హాల్), గాంధీ నగర్ (వినోబా మందిరం), 22న ఇందిరానగర్ కాలనీ (అంబేద్కర్ యువజన సంఘం), సాయినగర్ కాలనీ (నాగార్జున బ్యాంక్ సమీపం), ప్రగతి నగర్ (ప్రగతి యువజన సంఘం), 23న రేవణ పల్లి, సీతావానిగూడెం, బావనారుషిపేట, 24న ముక్తాపూర్ కమ్యూనిటీ హాల్, ముక్తాపూర్ వార్డు ఆఫీస్, ప్రకాశ్‌నగర్ కాలనీ కేవీటీ స్పోర్ట్స్ క్లబ్, చేనేత డై హౌస్ లక్ష్మణ్‌నగర్ కాలనీలో వార్డు సభలు జరుగుతాయని పేర్కొన్నారు.

21నుంచి గ్రామ సభలు

రాజాపేట, జనవరి 19 : 4 సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామాల్లో ఈ నెల 21నుంచి 24వరకు ఉదయం 10గంటలకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న కాల్వపల్లి, లక్ష్మక్కపల్లి, బూర్గుపల్లి, రేణికుంట, దూదివెంకటాపురం, కొత్తజాల, 22న బసంతాపురం, నెమిలె, సోమారం, జాల, నర్సాపురం, సింగారం, 23న రఘునాథపురం, బొందుగుల, పాముకుంట, రాజాపేట, పుట్టిగూడెం, మల్లెగూడెం, 24 బేగంపేట, చల్లూరు, పారుపల్లి, కుర్రారం, కొన్‌రెడ్డిచెర్వు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

టాటా ముంబయి మారథాన్ విజేత దుబ్బ కిషన్

వలిగొండ, జనవరి 19 : మండలంలోని పొద్దటూర్ గ్రామానికి చెందిన దుబ్బ కిషన్ టాటా ముంబయి మారథాన్‌లో 42.195 కిలోమీటర్ల పరుగు పందేన్ని 4గంటల 20నిమిషాల 17 సెకండ్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. హైదరాబాద్‌లోని ఇంటెలిజెన్స్ కంట్రోల్ రూమ్‌లో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్న కిషన్ అనేక మారథాన్ పరుగు పందేల్లో పాల్గొని ఎన్నో పతకాలు, మెడల్స్, ప్రశంసా పత్రాలు సాధించాడు. టాటా ముంబయి మారథాన్‌లో విజేతగా నిలిచిన కిషన్‌కు నిర్వాహకులు పతకంతోపాటు సర్టిఫికెట్ అందజేశారు. పోలీస్ అధికారులు, మిత్రులు, బంధువులు అభినందనలు తెలిపారు.

రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ : ఆర్డీఓ

బొమ్మలరామారంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

బీబీనగర్/ బొమ్మలరామారం, జనవరి 19 : రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందజేస్తామని భువనగిరి ఆర్డీఓ ఎం.కృష్ణారెడ్డి అన్నారు. బీబీనగర్ మండలంలోని కొండమడుగు గ్రామంలో, బొమ్మలరామారం మండల కేంద్రంలో వ్యవసాయేతర భూములను అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డుల వెరిఫికేషన్ లిస్ట్‌లో పేర్లు రాని వారు ఆందోళన చెందవద్దన్నారు. పేరు లేనివారు గ్రామ సభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారి సుభాషిణి, తాసీల్దార్లు ఎం.శ్రీధర్, శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ దుర్గేశ్వరి పాల్గొన్నారు.

రైతు భరోసా కోసం సర్వే

ఆత్మకూరు(ఎం) : రైతుభరోసా కోసం మండల కేంద్రంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేపట్టారు. సాగుకు అనుకూలంగా లేని భూములతోపాటు రోడ్లు, వెంచర్లు, ఫంక్షన్‌హాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మల్లికార్జున్‌రావు, ఏఈఓ మనీషా, సర్వేయర్ స్వాతి పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాంచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాంచంద్రారెడ్డి

రాజాపేట, జనవరి 19 : ఎన్నికల్లో చెప్పిన మాయమాటలు నమ్మి అధికారం కట్టబెట్టిన పాపానికి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలుకు నోచుకోలేదన్నారు. రుణమాఫీ చేయకుండా రైతన్నలకు ఒక కారు రైతు భరోసా ఎగ్గొట్టారని, పెట్టబడి సాయం రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.12వేలు ఇస్తామంటున్నారని మండిపడ్డారు. వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటూ రైతు భరోసాకు అనేక కొర్రీలు పెట్టి ఎగ్గొంటేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో ఇచ్చినట్లు రైతులందరికీ పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. తమది ప్రజాపాలన అంటూ ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిని నిర్బంధించడం సిగ్గు చేటన్నారు. ఈ నెల 21న నల్లగొండలో కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే రైతు మహాధర్నాకు రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాకల్ల ఉపేందర్, నాయకులు చింతలపూరి వెంకట్రామారెడ్డి, సందిల భాస్కర్‌గౌడ్, బెడిదె వీరేశం, ఎర్రగోకుల జశ్వంత్, సంగి ఉపేందర్, భాస్కర్, రాజు పాల్గొన్నారు.

సాగునీటి సాధన కోసం ఉద్యమించాలి : భగవంతరెడ్డి

సాగునీటి సాధన సమావేశంలో భగవంతరెడ్డి, నాయకులు

చౌటుప్పల్, జనవరి 19 : సాగునీటి సాధన కోసం ప్రతిఒక్కరూ ఉద్యమించాలని తెలంగాణ జలసాధన పోరాట సమితి నాయకులు ప్రొఫెసర్ కట్ట భగవంతరెడ్డి అన్నారు. మండలంలోని ఎల్లగిరి గ్రామంలో సాగు నీటి సాధన కోసం ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో వర్షాలే సాగునీటికి ఆధారమన్నారు. సాగునీటి శాశ్వత పరిష్కారం కోసం ప్రజలు ముందుకు రావాలని కోరారు. కలిసికట్టుగా పనిచేసి సమీప సాగునీటి వనరులను తెచ్చుకోవాలని సూచించారు. సమావేశంలో నాయకులు మెట్టు సుదర్శన్‌రెడ్డి, గోపి సుధాకర్, బూర్గు కృష్ణారెడ్డి, మోహన్, జగన్మోహన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే కుంభం

రోడ్డు శంకుస్థాపన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, జనవరి 19 : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. వలిగొండ నుంచి కాటేపల్లి వరకు రూ.33కోట్లతో నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసే ప్రాంతాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు పనుల శంకుస్థాపనకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు వస్తారని తెలిపారు. శంకుస్థాపన అనంతరం వలిగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారంలో పాల్గొంటారన్నారు. ఈ నెల 26నుంచి ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద రైతులకు పంట పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని రైతు కూలీలకు రూ.12వేలు అందించబోతుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమానాయక్, మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ కొమ్మారెడ్డి నరేశ్‌రెడ్డి, నాయకులు వాకిటి అనంతరెడ్డి, పాశం సత్తిరెడ్డి, నూతి రమేశ్, యుగంధర్ రెడ్డి, వెంకట్‌పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల అభ్యున్నతికి కృషి

బీబీనగర్ : ఫొటోగ్రాఫర్ల అభివృద్ధికి ప్రభుత్వం తరఫున కృషి చేస్తామని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఇటీవల మృతిచెందిన రామన్నపేటకు చెందిన ఫొటోగ్రాఫర్ రామకృష్ణ కుటుంబ సభ్యులకు కుటుంబ భరోసా కింద మంజూరైన రూ.1.60లక్షల చెక్కును అందజేశారు.

సమతా రాజ్య స్థాపనకు కృషి చేయాలి

- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్

బెల్లి యాదయ్యను సన్మానిస్తున్న గౌరీశంకర్, కవులు

రామన్నపేట, జనవరి 19 : సమతా రాజ్య స్థాపనకు కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్ర స్థాయి పురస్కారం దక్కిన డిగ్రీ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు మట్టి కవి డాక్టర్ బెల్లి యాదయ్యకు ఆదివారం ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గౌరీశంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమష్టిగా పోరాడి రాష్ట్రం సాధించుకున్న విధంగానే బీసీల్లో సమష్టిగా పోరాడే తత్వం రావాలన్నారు. రాబోయే రోజుల్లో సంభవించే బీసీ విప్లవాన్ని ఆపడం ఎవరితరం కాదని పేర్కొన్నారు. అంబేద్కర్ మరో పదేండ్లు బతికి ఉంటే బీసీలకు తగిన రిజర్వేషన్లు వచ్చేవని తెలిపారు. ఓట్లు వేసే వాళ్లు పాలకులు కాలేరా? అని ప్రశ్నించారు. మన ఓట్లు మనమే వేసుకొని మన సీట్లను మనమే సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రెండు శతాబ్దాల క్రితమే జ్యోతీరావు పూలే బీసీల స్వాతంత్ర్యం గురించి ప్రశ్నించారని, అదే స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. పురస్కార గ్రహీత బెల్లి యాదయ్య మాట్లాడుతూ ఆయుధాల కంటే అక్షరాలే ఎక్కువ ఉపయోగమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, పూర్వ విద్యార్థులు బెల్లి యాదయ్యను సన్మానించారు. బొడ్డుపల్లి వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ సభలో తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందచారి, ప్రజా గాయకుడు పీవీ రమణ, మాజీ ఎంపీటీసీ ఎండి రెహాన్, తిరుగుడు మల్లికార్జున్, నీల అయిలయ్య, బాసరాజు యాదగిరి, హరికిషన్, రమేశ్, సైదులు, ధనోజ, శివకుమార్, హన్మంతు పాల్గొన్నారు.

లలిత శతకం పుస్తకావిష్కరణ

పుస్తకావిష్కరణలో పాల్గొన్న కవులు, రచయితలు

భూదాన్ పోచపల్లి, జనవరి 19 : వడ్డేపల్లి రాజేశ్వర్ రచించిన లలిత శతకం పుస్తకాన్ని పట్టణంలోని చేనేత టై అండ్ డై సిల్క్ చీరెల ఉత్పత్తిదారుల సంఘం భవనంలో జాతీయ తెలుగు సాహితీ పీఠం (హైదరాబాద్) ఆధ్వర్యంలో సాహితీ పీఠం అధ్యక్షుడు డాక్టర్ నలవోలు నరసింహారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ చైతన్య కోసం కవులు తమ రచనలు సాగించాలన్నారు. నేటి తరం పిల్లలకు పద్యాలు నేర్పుతూ శతకాలపై ఆసక్తి పెంచడానికి ఇలాంటి పుస్తకాలు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు. పుస్తకం హస్త భూషణం అని, పుస్తకంలోని విషయం మస్తిష్కంలో చేరితే మనిషి నడవడికలో మార్పు కలిగి మంచి మార్గంలో పయనిస్తారని పేర్కొన్నారు. చేనేత కార్మికుడైన వడ్డేపల్లి రాజేశ్వర్ శతకం తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షుడు కసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రముఖ కవులు రావిరాల స్వామి, పట్నం కృష్ణకుమార్, రాపూరి వనజ, అరుణస్వామి, శ్రీరాములు, కృష్ణకుమార్, మహేశ్వర్, పాండురంగం శాస్త్రి, రామకృష్ణ, దయానంద్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతోపాటు దేశభక్తిని అలవర్చుకోవాలి

విద్యార్థుల పరేడ్ తిలకిస్తున్న ఆర్మీ అధికారులు

ఆలేరు టౌన్, జనవరి 19 : విద్యార్థులు క్రమశిక్షణతోపాటు దేశభక్తిని అలవర్చుకొని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆర్మీ అధికారులు దీపక్, సంతోష్ అన్నారు. ఆలేరులోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆలేరు, పోచన్నపేట, దేవరుప్పల ఉన్నత పాఠశాలల క్యాడెట్లకు 10వ ఎన్‌సీసీ వరంగల్ బెటాలియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్మీ వింగ్‌కు సంబంధించిన ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రమశిక్షణ, జాతీయ సమైక్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం కోసం ఎన్‌సీసీ దోహదపడుతుందన్నారు. దేశం కోసం పని చేయాలనే ఆలోచన విద్యార్థుల్లో కలుగుతుందని తెలిపారు. సైనిక విభాగానికి సంబంధించిన డ్రిల్, పరేడ్, వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, హెల్త్ అండ్ అవేర్‌నెస్, జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యత, ఫీల్డ్ క్రాఫ్ట్, బాటిల్ క్రాఫ్ట్ అంశాలపై రాత పరీక్ష నిర్వహించామని ఆర్మీ అధికారులు తెలిపారు. ఈ పరీక్షల్లో ఎన్‌సీసీ అధికారులు ప్రిసైడింగ్ అధికారి దూడల వెంకటేశ్, ఫస్ట్ ఆఫీసర్ బాలారెడ్డి, థర్డ్ ఆఫీసర్ కృష్ణ పాల్గొన్నారు.

పెట్రోలింగ్ ట్రాక్‌మెన్లను ఇద్దరిని కేటాయించాలి

- సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు

బీబీనగర్, జనవరి 19 : పెట్రోలింగ్ ట్రాక్‌మెన్లను ఇద్దరిని కేటాయించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఘట్‌కేసర్ బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రెటరీ ఎర్రవెల్లి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రైల్వే ట్రాక్‌లపై అడవి మృగాలు బీభత్సం సృష్టిస్తున్నాయని, అర్ధరాత్రి వేళల్లో రైల్వే ట్రాక్‌ను దాటుతూ మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ట్రాక్‌మెన్ భయాందోళనకు గురవుతున్నారని, అడవి పందులు ఎక్కడి నుంచి వచ్చి దాడి చేస్తాయోనని కార్మికులు భయపడుతున్నారని పేర్కొన్నారు. నైట్ పెట్రోలింగ్ మెన్ పొట్ట భరత్ కుమార్ శనివారం రాత్రి బీబీనగర్ – ఘట్‌కేసర్ రైల్వే ట్రాక్‌ను పరిశీలిస్తుండగా అడవి పందులు ఒక్కసారిగా దాడి చేయగా తప్పించుకున్నాడని తెలిపారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నైట్ డ్యూటీ పెట్రోలింగ్ ట్రాక్‌మెన్లను ఇద్దరిని కేటాయించాలని కోరారు. లేకుంటే సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

బాల కార్మికులతో పనిచేయిస్తున్న ఇద్దరిపై కేసు

భూదాన్ పోచంపల్లి, జనవరి 19 : దుకాణాల్లో బాల కార్మికులతో పనిచేయిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని టీ వరల్డ్ టీ స్టాల్‌లో బీహార్ రాష్ట్రానికి చెందిన మిథిలేశ్ (16), సురేశ్ బైక్ మెకానిక్ షాపులో చింతకింది అభిలాష్ (17)ను చట్ట విరుద్ధంగా పనిచేయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. షాపు యజమానులు కొండాపురం గణేశ్, చింతల సురేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.